అజ్ఞాత కథకుడు

బోర్లాపడుకుని పత్రిక చదువుకుంటున్న సరోజిని ఒక్క పెడబొబ్బపెట్టి లేచి కూచుంది.

"చూశావా, సత్తెం అన్నయ్యా?"

పడకకుర్చీలో పడుకుని ఇంగ్లీషు హాస్యనవల చదువుకుంటున్న సత్తెం పుస్తకంమీదనుంచి కళ్ళు తియ్యకుండానే ప్రశ్నార్థకంగా "ఊఁ?" అన్నాడు. ఆ చిన్న శబ్దంలో 'నా చదువు అనవసరంగా పాడుచెయ్యకు. నువ్వు అయినదానికీ కానిదానికీ ఆర్భాటం చేస్తుంటావు. ఆ మాటనాకు తెలుసు, నీకూ తెలుసు. నాకు తెలుసునని కూడా నీకు తెలుసు. నన్ను పలకరించటంగురించి పునరాలోచించుకో. నిజంగా అవసరమైతేగాని మళ్ళీ పలకరించకు' అన్నఅర్థంవున్నది. చిన్నన్న ఇంటివాళ్ళందరితోనూ ఇటువంటి భావగర్భితమైన శబ్దాలు చేస్తూంటాడు. వాటి అర్థం సరోజినికి తెలుసు. అయితే ఆమెలో ప్రత్యేకత ఏమంటే ఆమె ఈ భావాలను కొంచె

మైనా లక్ష్యపెట్టేదికాదు. ఆడదిగా తనకు కొన్ని అధికారాలూ, ప్రత్యేకతలూ ఉన్నాయి. ఉదాహరణకు, యెంత తాను కోపం తెప్పించినా సత్తెం పళ్లు కొరకగలడేగాని అంతకుమించి ఏమీ చెయ్యలేడు. ఈ అధికారం చాటున ఉండి ఆమె పెద్దన్న అయిన లక్షింపతిని కళ్ళనీళ్ళదాకా తెస్తూండేది. చిన్నన్న అయిన సత్తెంను పళ్ళుకొరికిందాకా రెచ్చగొడుతూండేది.

అయితే ఇప్పుడు సరోజిని అటువంటి 'మూడ్'లో లేదు ఈసారి ఆమెది తెచ్చిపెట్టుకున్న ఆవేశంకాదు

"ఏడెవడో ఈ కథచూడు ఎట్లా రాశాడో? అంతా మనమీదే అన్నయ్యా!"

సత్తెం యిక ఉదాసీపంగావుండి లాభంలేదు. ఎవడో తనమీద కథ రాశాడన్న ఆరోపణ వచ్చినతరవాత దాని విషయం తేల్చుకోకుండా వుడ్‌హౌస్ వ్యాసం ఆస్వాదిస్తూ పోవటం అంతరాత్మగలవాడు చేసేపనికాదు.

కొద్దిరోజులక్రితం సరోజిని ఇట్లాగే దారేవెళ్ళేవాడి మీద ఒక ఆరోపణ చేసింది—వాడు రోడ్డుమీదుగా పోతూ తనకేసే చూస్తూ వెళ్లాడని. "చూస్తే చూశాడు లెస్తూ" అన్నాడు లక్షింపతి. వాణ్ణిపట్టుకుని శిరచ్ఛేదంచేసి వాడి తల తెచ్చి సరోజిని కాళ్ళముందుపెట్టి, "నీపగ తీరిందా?" అని అడగవలసిన భారం సత్తెంమీద పడింది. సత్తెం అంతపనీ చేసేవాడే, వాడు దొరికినట్టయితే. "ఈసారి వాడు మన ఇంటిముందుగా వెళితే నాకు చెప్పు" అన్నాడు సత్తెం. సరోజినికి సగంపగ తీరినట్టే అనిపించింది. వాడు మళ్ళీ కని

పిస్తాడేమోనని ఆమె చాలా రోజులు పనిమానుకుని నిరీక్షించింది. కాని ఆ పిరికి వెధవ మళ్ళా రాలేదు. తనపగ సొంతం తీరనందుకు కాబోలు సరోజిని చాలా నిరాశ చెందింది...

"ఎవరా కథ రాసినవాడు?"

"ఎవడో ఏట్లోవాడు!" అంటూ సరోజిని పత్రిక పేజీలు తిరగేసి కథకుడిపేరు చూసింది. "ఎవరో ఎ. ఎస్. రావుట."

ఆ పేరు సత్తెం రెండుమూడుసార్లు మననంచేశాడు, ఎవరిముఖమైనా స్ఫురిస్తుందేమో నన్నట్టుగా.

"పొడి అక్షరాలు ఏడిచాడు, ఎవరన్నా కనుక్కోపోతారని" అన్నాడు సత్తెం. "ఒకవేళ ఎ. నారాయణరావేమో, నరసింహారావుకూడా కావచ్చు. నాగేశ్వర్రావెందుకు కాగూడదూ? ఇటువంటి పేరుగల కథలు రాసేవాడెవడూ జ్ఞాపకం రావటంలేదే?"

"అసలది దొంగపేరై వుంటుంది"

"అట్లా అయితే మనం చచ్చినా కనుక్కోలేం" సత్తెం కుర్చీలో మళ్ళా చేరగిలపడి పుస్తకం చదివే యత్నం చెయ్యసాగాడు.

సరోజినికి గొప్ప నిరుత్సాహం కలిగింది. ఇంకా ఎంతో కర్మకాండ జరగవలసి వుండగా అప్పుడే సత్తెం చేతులు కడిగేసుకోవటం ఆమెకిష్టంలేదు.

ఈ కథకుడి శిరస్సు ఖండించి తెచ్చి సరోజిని పాదాల దగ్గిర పెట్టే బాధ్యత తనమీదనుంచి జారిపోయినందుకు

సంతోషిస్తున్న సత్తెం, సరోజిని మాటలకు బిగుసుకు పోయాడు.

"ఈ కథ నువ్వుకూడా చదువు. తరవాత మెల్లిగా కూచుని ఆలోచిస్తే ఎవరు రాసిందీ తెలుస్తుంది. ఎవడో బాగా యెరిగినవాడే అయివుంటాడు" అన్నది సరోజని.

హాయిగా వుడ్‌హౌస్ చదువుకుంటున్న ప్రాణిని పని పెట్టుకుని మనోవేదన కలిగించే ఆ కథ చదవమంటే ఎట్లా వుంటుంది? సరోజిని వొట్టి 'మోర్బిడ్' మనిషి అయి వుండాలి మనస్సుకు అసహ్యమైన వివరాలు కలిగించే వాటిని పనిపెట్టుకుని వెతుకుతుంది కింద ఏడు ఎవరో ఆడది మొగుడుతో పోట్లాడి భావిలోపడి చస్తే శవాన్ని చూడటానికి పరిగెత్తింది. ఆ శవాన్ని సరోజిని పదిరోజులపాటు భోజనాలదగ్గిరా, పడుకోబొయ్యేటప్పుడూ వర్ణిస్తూనే వుంది. సత్తెం ఇటువంటి జుగుప్సాకరమైన విషయాల జోలికి వెళ్లేవాడుకాడు. తప్పనిసరి అయి వాటిని ఎదుర్కోవలసివస్తే చలించేవాడుకాడు. సరోజిని తనకన్న ఎక్కువగా చలించినట్టు కనబడుతూ వాటికోసం వెతుకుతుంది అందుచేత ఆమె మనస్తత్వం సత్తెం వూహించలేకపోయేవాడు, ఆమెకు వాస్తవంగా జుగుప్స కలిగించేవి ఇష్టమనీ, పైకి ఇష్టంలేనట్లు నటిస్తుందని అతనికి చాలాసార్లు తట్టింది. కాని ఈమాట పైకి అంటే యిక యింటిల్లిపాదికీ నాలుగు రోజులపాటు నిద్రాహారాలుండవు. సరోజినే ఒక జుగుప్సాకరమైన విషయమన్నట్టుగా భావించేవాడు సత్తెం.

ఇంతకీ ఆమె తన నా కథ చదవమంటుంది. చదివి చేసేదేమీ వుండదు. అందులో నిజంగా తమ కుటుంబం గురించి ఏమన్నా రాసివుంటే తనకు మనఃక్లేశం కలగటం తథ్యం. దాన్ని చదవకపోతే వుండే క్షేమం చదివితే లేదు. ఒకసారి తను కథ చదివాడో, హత్యకేసులో సాక్షిఅయినట్టే.

"నువు సొంతం చదివావా? నువు చదువు నేను మెల్లిగా చూస్తాలే!" అన్నాడు సత్తెం ముఖానికి వుడ్‌హౌస్ అడ్డంపెట్టుకుంటూ.

"అయిపోయింది. ఈ ఒక్క పేజీ చదివి నీకిస్తా," అన్నది సరోజిని.

తిరిగి వుడ్‌హౌస్ పారవశ్యంలో పడిపోయిన సత్తెం వాస్తవ ప్రపంచంలోకి వచ్చేసరికి సరోజిని పక్కన నిలబడి వుంది. అతని ముఖంమీద పత్రికవుంది. "చదువు నీకే తెలుస్తుంది," అంటున్నది సరోజిని.

బలవంతాన సత్తెం వుడ్‌హౌస్‌ను పక్కన పెట్టి పత్రిక అందుకున్నాడు సరోజిని ఇంతసేపూ మాట్లాడుతున్న కథపేరు "పెళ్ళి ఇక్కట్లు". కథకుడిపేరు ఎ. ఎన్. రావుఅని వుంది. సత్తెం కథను మొదలుపెట్టి చదవటానికి బదులు పైనుంచి కిందికీ, కిందినుంచి పైకీ, పక్కలకీ చూడసాగాడు పేజీలు తిప్పి, "అబ్బో, చాలా పెద్దకథే!" అన్నాడు.

"పైకి చదువు– నేనుకూడా వింటా" అన్నది సరోజిని. 'నేను వినేట్టు చదివితేగాని నీకా కథ అర్థం కావలసిన విధంగా అర్ధంకాదు' అన్నట్టు.

"నువు చదివితివిగా?" అన్నాడు సత్తెం.

'నువు ఆ కథ రాసినవాడిపక్షం కావాలని చూస్తున్నావు గామాలు, ఈ పప్పులు నా దగ్గిర వుడకవు' అన్నట్టుగా ముఖం పెట్టింది సరోజిని.

"సుందరి వరండా స్తంభాన్ని ఆనుకుని కూనిరాగాలు తీస్తూ రోడ్డుమీద పొయ్యేవాళ్ళని అదోకరకమైన దొంగ చూపులు చూస్తున్నది" అని చదవసాగాడు సత్తెం, ఎవరో తనను తోస్తున్నట్టుగా.

"సుందరి అంటే ఎవరో తెలుసా? నేనూ! నేను వరండాలో నిలబడి రోడ్డుమీద పొయ్యేవాళ్ళని దొంగ చూపులు చూస్తానా?" అని దబాయించింది సరోజిని.

"అయినప్పుడా సుందరి నువ్వే అని యెందుకనుకోవటం" అన్నాడు సత్తెం కొంచెం విసుగుగా.

"ఇంతేనా నీకు తెలిసింది? చదువు మరి. ఆ సుందరికీ నాలాగే పదహారోఏడు. దానికికూడా సినిమాల్లో వేషం వెయ్యాలనుందట," అన్నది సరోజిని మూతి ముడుచుకుంటూ.

"నీకు సినిమాల్లో వేషం వెయ్యాలనుందా?" అన్నాడు సత్తెం ఆశ్చర్యంగా.

"ఎవరికిమాత్రం ఉండదేమిటి?" అన్నది సరోజిని.

"అందరికీ ఉండేటప్పుడు ఆ సుందరి నువ్వే అని ఎందుకనుకోవాలీ" అని, అన్నాడు సత్తెం.

"ఒక్కమాట చదివిప్రశ్న వేస్తావేమిటి? చదువూ. అది కూడా థర్డ్‌ఫారం పాసయి చదువు చాలించిందట"

"నువ్వు నాలుగో నెల్లు పోర్తాఫారం వెలిగిస్తివిగా?"

"తేడా ఏమిటో?"

"ఇంకేం పోలికలున్నై?"

"చదవమంటే చదవడేం? నేను పెళ్ళికోసం తహ తహ లాడుతున్నానుట! ఎవరో స్నేహితురాలి దగ్గిర రహస్యంగా సెక్సు పత్రికలు చదివానుట!"

"నువ్వంటే ఈ సుందరనేగా నీ ఉద్దేశ్యం?"

"కాదు. సుందరంటే నేనేనని వాడి ఉద్దేశ్యం—ఆ రాసినవాడి ఉద్దేశం"

"ఇంతకీ నువ్వు స్నేహితురాలి దగ్గిర సెక్సు పత్రికలు చదివావా?"

"నువే తెస్తావుగా ఏవేవో పత్రికలూ?"

"నువ్వు వాటిని చదివినప్పుడు వాడు రాశాడని రోషమేం?"

"సెక్సు పత్రికలు చదవటం తప్పా? అందులో ఎంతో విజ్ఞానం ఉంది."

"మరయితే నువెందుకు గింజుకుంటున్నావో నాకు తెలియటంలేదు"

"నీ కొకటీ అర్థంకాదు. నేనా సెక్సుపత్రికలు చదివి చెడిపోయానుట-వాడంటున్నాడు.

"సుందరి చెడిపోయినట్టుగా రాశాడా ఏం?"

"అదొక్కటే తక్కువ."

సత్తెం పూర్తిగా అయోమయంలో పడ్డాడు.

"నేనీకథ చదివేస్తానుగాని ఈ సుందరి ఏంచేస్తుంది చెప్పు?"

"ఏంచేస్తుందా? ఆ కథ చెప్పేవాణ్ణి పెళ్లాడేస్తుంది! ఈ కుంకనుచూసి నేను ప్రేమిస్తానుట—హుం!"

"ఇంకేం? నిన్ను గొప్పగానే చూపించాడుగా? ఎందుకీ ఉక్రోషం? నన్ను గురించి ఎవరన్నా అట్లా రాస్తే నేను ఎంతో సంతోషిస్తా!"

"నిన్ను గురించీ ఉంది అందులో. నువు బియ్యే పాసయి వాజల్లే ఇంట్లో కూచున్నావుట. నా పెళ్ళిసంగతి నీకు పట్టదుట"

"వాజ అనేమాట అందులో లేకపోవాలీనీపళ్ళు రాలగొడతా!" అన్నాడు సత్తెం, ఆడదానికి చూపవలసిన మర్యాదకాస్తా మరిచిపోయి.

"ఉండకుండా ఉంటుందా ఏం? మొత్తానికి నువు వాజవన్నట్టే రాశాడు."

"పోనీ నాకన్నా నిన్నే బాగా రాశాడుగద! కథ చదివి నే నేడుస్తాలే. నువు నిశ్చింతగా ఉండు"

సత్తెం తిరోగమిస్తున్నట్టుగాతోచి సరోజినిపంచాంగం విప్పింది!

ఈ ఇంట్లో మగవాళ్ళకి కొంచెమైనా సిగ్గూ, ఎగ్గూ లేదు. వాళ్ళ అమ్మల్నీ చెల్లెళ్ళనీ ఎవరేమన్నాసరే పట్టించుకోరు. ప్రతి వెధవా స్నేహితుడల్లే ఇంటికి రావటమూ, మనని గురించి అవాకులూ చెవాకులూ రాయటమూ, మనం

దులిపేసుకుని వాళ్ళకి కాఫీలూ ఫలహారాలూ మెక్కబెట్టటమూనూ!"

"నన్నేంచెయ్యమంటావే?"

"చాతయితే ఈ కథ యెవడు రాశాడో కనుక్కొని వాడి భరతం పట్టించు ఇంటికి పిలిచి మేమందరం చూస్తుండగా వాడిబొచ్చురాలగొట్టి యీదవడాఅదవడా వాయించి, పంపించు. నువ్వువాజవనే ధైర్యంతోనే వాడాకథ రాశాడు."

"నన్ను ముందు కథ చదవనీ," అన్నాడు సత్తెం, ఈ సంత తాత్కాలికంగానైనా వదిలించుకుందామని.

సత్తెం కథ చదవనారంభించాడు. వుడ్‌హౌస్‌కు అంకితం చేయవలసిన కాలం ఈ దిక్కుమాలిన చెత్త కథ మీద—అందులోనూ ఒక తెలుగు కథకోసం—దుర్వినియోగమవుతున్నదే అన్న బెంగ అతన్ని బాధిస్తూనేఉంది.

కథ చదువుతుంటే అక్కడక్కడా తన కుటుంబానికి మంచిదెబ్బలే కనిపించాయి! సుందరిపాత్ర కనీసం సగానికి సగం సరోజినే కానీ రామగోపాల్ పాత్ర పన్నెండు వీసాలు తనూ! లక్ష్మీంపతికూడా ఉన్నాడు. అయితే సుందరికి వాడు అన్నకాదు, తండ్రి. సుందరి తల్లికీ తన తల్లికీ లీలగా పోలిక కనిపిస్తున్నది. కథలో గొప్ప విషయం ఏమీ లేదు. సుందరికి మొగుణ్ణి సంపాదించటానికి మిగిలినవాళ్ళు చాలా యాతన పడతారు. చిట్టచివరకు పొరిగింటివాడికే ఇచ్చి చేస్తారు.

ఈ కథ తమ కుటుంబాన్నిగురించేఅనిసత్యంనమ్మలేకపోయాడు, కాని తమ కుటుంబాన్ని ఎరిగున్నవాడు రాసి వుండటం అసాధ్యంకాదు. లక్ష్మింపతి ఇంటికి వచ్చాక

అందరూ కూచుని కథ చదివారు. సరోజినిలాగే లక్షింపతి కూడా, "ఇదేదో తెలిసినవాడు చేసినపనే, సందేహం లేదు. కాకపోయినా మనం వేగిరం సరోజాకు పెళ్ళిచేసెయ్యటం మంచిది" అన్నాడు, రెంటికీ గాఢమైన సంబంధం వున్నట్టు.

"చిన్నన్నయ్య ఇంటికి తెచ్చే వెధవ సజ్జులోనే ఒక అంట్ల వెధవ రాసివుంటాడు" అన్నది సరోజిని.

"నాకోసం వచ్చేవాళ్ళలో సూర్యనారాయణకుతప్ప యింకెవరికీ సరిగా ఉత్తరంముక్క రాసేశక్తికూడా లేదే!" అన్నాడు సత్తెం.

"ఛీ, పాపం. సూర్యనారాయణ అటువంటివాడు కాడురా!" అని తల్లి సర్టిఫికెట్టిచ్చింది.

"అదీకాకవాడికి పెళ్ళయిపోయింది. ఇది రాసినవాడికి సరోజను పెళ్ళాడాలనే ఏడుపేదో వుంది. నన్నడిగితే యిది ఆ గోపాలుగాడిపనేమో అని—" అన్నాడు లక్షింపతి.

"గోపాల్‌గాడు ఇందులో ఒక్క వాక్యం రాయలేదు. నేను రాపిస్తా" అన్నాడు సత్తెం.

"పొరిగింటివాడంటే యెవరై వుంటారూ?" అని తన్ను తాను ప్రశ్నించుకున్నాడు లక్షింపతి.

"ప్రసాదరావా?" అన్నాడు సత్తెం ఆశ్చర్యంతో.

"నీదంతా చోద్యంరా. ఆ ప్రసాదరావుకు మన అమ్మాయి నిచ్చుకుంటామా ఏం? అంతకులంకూడా పాటించనంత గండకత్తెర ఏమొచ్చిందీ?"

"నీకు తెలీదులే, అమ్మా! ఆత్రంకొద్దీ రాయటానికి అడ్డేమిటి? పెళ్ళయినట్టు రాయగానే అయిపోయిందా?"

"ప్రసాదరావు రాస్తాడని నేను నమ్మను" అన్నది సరోజిని. "అతను చాలా మంచివాడు. ఇంకెవరో రాసి వుంటారు, సరిగా ఆలోచించండి."

"ఏమర్రా? యేదో చర్చిస్తున్నట్టున్నారే?" అంటూ లోపలి కొచ్చాడు భీమరాజు బాబాయి.

"రా, బాబాయ్. ఏమిటా ఉత్తరం?" అన్నాడు ఇంటిపెద్ద లక్షింపతి.

"ఏముందిరా? కిందటివారం అక్కిరాజు రమణయ్య గారికి ఉత్తరం రాసినే. ఆయన జవాబు రాశారు. వాళ్ళ బ్బాయి పిల్లను చూసుకుని ఇష్టపడితే మిగిలిన వాటన్నిటికీ సమ్మతమేనట!"

బాబాయి తన చేతిలో ఉత్తరం లక్షింపతికిచ్చాడు. లక్షింపతి చదువుకుని, "అబ్బాయి రేపేవస్తాడన్నమాటా?"

"అవును. మా యింటికే వస్తాడు. మా రాఘవులు వెంట పంపిస్తా. పిల్లతో మాట్లాడనివ్వండి. తప్పేం లేదులే!"

మర్నాడు ఉదయం తొమ్మిది పది మధ్య పెళ్ళి కొడుకు చూపులకు వచ్చాడు. కుర్రాడే. మద్రాసు స్టేష న్‌లో ఉన్నాడు. చూడటానికి అందంగానూ చురుకుగానూ వున్నాడు. కొంచెం బిడియస్తుడు. మద్రాసు ట్రాముల్లాగే, నాలుగు మాటలు గబగబాఅని అకస్మాత్తుగా ఆగిపోతాడు, మళ్ళీ ఇంకో తోపుతో స్టేగాని కదలడు. పేరు నాగభూషణ రావు. భూషణం అంటారు.

పెళ్ళికూతురువారు అతనిచుట్టూ మూగారేగాని సంభాషణకు ఎక్కువ సహాయపడలేదు. ఎవరూ మాట్లాడని

క్షణాల్లో పెళ్ళికొడుకు ఒంటరిగా డైపోయి చాలా యిబ్బంది పడుతున్నట్టు స్పష్టమయింది. పెళ్ళికూతురుమాత్రం ఈ సదస్యులు వుండికూడా లేనట్టు నటించటానికి పత్రిక ఒకటి సాకుగా పెట్టుకుని పేజీలు తిరగేస్తూ, మధ్య మధ్య తల యెత్తకుండా కనురెప్పలు మాత్రం ఎత్తి పెళ్ళికొడుకును దొంగచూపులు చూస్తున్నది

పెళ్ళికొడుకు దృష్టి అకస్మాత్తుగా పెళ్ళికూతురు చేతిలోని పత్రికమీద పడింది. మునిగిపోతున్నవాడికి గడ్డిపోచ దొరికినట్టు, ప్రేక్షకుల మౌనాన్ని భరించలేకుండా ఉన్న పెళ్లికొడుక్కి ఈ పత్రిక దొరికింది.

"ఈ పత్రిక ఇక్కడకూడా ఉందే!" అన్నాడతను.

"మా సరోజినికి పత్రికలంటే ఇష్టం. ప్రతి పత్రికా అయిదారుసార్లు చదువుతుంది."

పెళ్ళికొడుకు ముఖం దేవురించింది. అతి కష్టంమీద అతను. "అందులో నా కథకూడా ఉంది" అన్నాడు.

"ఆఁ?" అందరూ ఆశ్చర్యం ప్రకటించారు.

"ఏదో పిచ్చికథ, దానిపేరు "పెళ్ళియిక్కట్లు". మళ్ళీ పెళ్ళికొడుకు బిగుసుకుపోయాడు.

సత్తెం ముఖాన కత్తివాటువేస్తే నెత్తురుచుక్క లేదు లక్షింపతీ, తల్లీ ఒకరిమొహం ఒకరుచూసి కొద్దిగా చిరునవ్వు నవ్వుకున్నారు.

"బలే మంచికథ!" అన్నది సరోజిని చెక్కుచెదరని ముఖంతో, ఎవరితో అంటున్నదీ ఎవరికీ అంతుబట్టకుండా.

పెళ్ళికొడుకు ముఖం ఆనందంతో జేవురించింది.

తరవాత భావి వధూవరులు ఒంటరిగా కూచుని మాట్లాడుకునేటప్పుడు. "నిజంగా నీకా కథ బాగుందా?" అన్నాడు పెళ్లికొడుకు.

"చాలా బాగుంది. నాలుగుసార్లు చదివాను" అన్నది, పెళ్ళికూతురు తల యెత్తకుండా.

"అటువంటి వాళ్ళుంటారు. కాదూ!" అన్నాడు పెళ్లికొడుకు.

"ఎక్కడన్నా ఉండొచ్చు" అన్నది పెళ్ళికూతురు.